క్లుప్తంగా

వీరన్నకు బంగారు కోరమీసం బహూకరణ

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి భక్తుడు బంగారు కోర మీసాన్ని శనివారం బహూకరించినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం రూరల్ మండల పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ఎం.శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఆయన తోపాటు కుటుంబసభ్యుల పేర్లపై గోత్రనామార్చనలు చేశారు. 2.786 మిల్లీ గ్రాముల బంగారు కోర మీసాన్ని బహూకరించి మొక్కు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనాలు అందజేశారు.

శ్రవణ నక్షత్ర పూజలు

మహబూబాబాద్ రూరల్: శ్రీవేంకటేశ్వర స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా మహబూబాబాద్ పట్టణంలోని శ్రీరామ ఆలయంలో కొలువై ఉన్న శ్రీవారికి శనివారం అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ పంచామృత అభిషేకం నిర్వహించి ఆభరణాలు, తులసీ, పూలమాలలతో వైభవోపేతంగా అలంకరించి పూజలు చేశారు.

కల్యాణ వేడుకలు

డోర్నకల్: స్థానిక బ్యాంక్‌స్ట్రీట్‌లోని వేంకటేశ్వరాలయంలో శనివారం పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 15న జిల్లాలో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగ్ యాత్రలపై శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు, బూత్ నాయకులు, జిల్లా ప్రజలు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వెన్నమల్ల సందీప్, కోకన్వీనర్ అశోక్, మదన్‌నాయక్ పాల్గొన్నారు.

అభినందనీయం


మహబూబాబాద్ రూరల్: దేశంలో ఎక్కడాలేని విధంగా బీసీ కులగణ ద్వారా 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని బీసీ సంఘం నేత శంతన్ రామరాజు అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే మురళీనాయక్‌ను శనివారం శంతన్ రామరాజు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.

16న పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ



మహబూబాబాద్ రూరల్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్లను మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీనాయక్ శనివారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని కురవి గేటు ప్రాంతంలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, ఈనెల 16వ తేదీ శనివారం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని విగ్రహ కమిటీ అధ్యక్షుడు జెర్రిపోతుల వెంకన్నగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ముత్యం వెంకన్న గౌడ్, బిక్కి వెంకటేశ్వర్లుగౌడ్, పెద్ది వెంకన్న గౌడ్, గునిగంటి మోహన్ గౌడ్, దొంతు రామ్మూర్తిగౌడ్, గునిగంటి కమలాకర్ గౌడ్, బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, వంగ వెంకటరమణ గౌడ్ పాల్గొన్నారు.

వృక్షాబంధన్



మహబూబాబాద్ అర్బన్: రక్షాబంధన్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఇంద్రకాలనీలో హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న 2018 సంవత్సరంలో మొక్కకు రాఖీ కట్టారు. అప్పటి నుంచి ఆ మొక్క వృక్షం అయింది. ఈ క్రమంలో ఆ వృక్షానికి శనివారం యాదవనగర్ కాలనీ మహిళలు రాఖీ కట్టి వృక్షంపై ప్రేమ చూపారు.

పెంపుడు కుక్కలకు రాఖీ



మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లిలో రక్షబంధన్ దినోత్సవం పురస్కరించుకొని శనివారం పెంపుడు కుక్కలకు దీపిక శనివారం రాఖీ కట్టారు. ముందుగ మంగళహారతి పట్టి బొట్టుపెట్టి పెంపుడు కుక్కలకు రాఖీ కట్టి వాటిపై ఉన్న ప్రేమను చాటుకున్నారు.

రక్షాబంధన్ వేడుకలు

సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలను శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు స్వగ్రామాలకు చేరుకొని తమ సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించారు. వారి ఆశీర్వాదం తీసుకొని ఎంతో ఆనందంగా గడిపారు.
– సాక్షి నెట్‌వర్క్



మరిపెడ రూరల్: డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు



గార్ల: సోదరులకు రాఖీ కడుతున్న సోదరీమణులు



దంతాలపల్లి: చిన్నారులకు రాఖీ కడుతున్న సోదరీమణులు



చిన్నగూడూరు: ఉగ్గంపల్లిలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు రాఖీ కడుతున్న కుమార్తె కవిత



చిన్నగూడూరు: రాఖీ కడుతున్న చిన్నారులు



కేసముద్రం: రాఖీలు కడుతున్న మహిళలు



మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యే మురళీనాయక్‌కు రాఖీ కడుతున్న సోదరి



పెద్దవంగర: అన్నలకు రాఖీ కడుతున్న సోదరి



మహబూబాబాద్ అర్బన్: అన్నకు రాఖీ కడుతున్న చెల్లి



మహబూబాబాద్ అర్బన్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లుకు రాఖీ కడుతున్న ఓర్సు పద్మ

సెల్ఫీ విత్ రాఖీ ఫొటోస్



అనన్య, హర్షిత్‌గౌడ్, చిన్ననాగారం, ఇనుగుర్తి



శ్రీలక్ష్మి, బీసీ కాలనీ, మహబూబాబాద్



సోదరుడితో అరుణశ్రీ, డోర్నకల్



ఉమ, నరేష్, రాజులకొత్తపల్లి, నెల్లికుదురు



దీక్షిత, పూర్ణేష్, మొగిలిచర్ల, కురవి



కైరా, సుహాస్, రాజోల్, కురవి

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

మహబూబాబాద్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో బీసీలందర్నీ ఏకం చేసి బలమైన ఉద్యమాన్ని చేపడతామన్నారు. దేశంలో సకల రంగాలలో పనిచేస్తూ సంపద సృష్టిస్తున్నది బహుజనులేనన్నారు. బీసీలకు రిజర్వేషన్ల కోటా లేదని ఎస్టీ, ఎస్సీలకు ఉన్న రిజర్వేషన్లు పోను అగ్రవర్ణాలే అధిక సంఖ్యలో ఉద్యోగాలలో చట్ట సభలలో లబ్ధి పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో 56శాతం బీసీలే ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విషయంలో కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్నపు సోమయ్య, సమ్మెట రాజమౌళి, సీతారాంనాయక్, రావుల రాజు, నాగన్న, హేమా పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

కురవి: పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కురవి శివారు లింగ్యా తండా గ్రామ పరిధిలోని బానోత్ తండాలో జరిగినట్లు శనివారం ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లింగ్యాతండా పరిధిలోని బానోత్ తండాకు చెందిన బానోత్ సైదమ్మ(50) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈనెల 6న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు మానుకోటలోని జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం

● ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్/మరిపెడ/కేసముద్రం/గూడూరు: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మురళీనాయక్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ ఉమ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ హాజరై కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నెముకలాంటిదని, రాబోయే రోజుల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్ నాయక్, నాయకులు దేవరం ప్రకాష్ రెడ్డి, నాయిని సత్యపాల్ రెడ్డి, మిట్టకంటి రాంరెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, బాలాజీనాయక్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గాడిపెల్లి చరణ్, మండల అధ్యక్షుడు రాంపెల్లి నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉబ్బపల్లి శ్రావణ్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, తదితరులు

బీసీ రిజర్వేషన్‌కు బీజేపీ అడ్డంకి

● సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

కురవి: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టం కాకుండా అడ్డుకుంటున్నది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సీపీఐ మండల కార్యవర్గ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం మండల కార్యదర్శి కరణం రాజన్న అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాస్త్రీయ సర్వే నిర్వహించి అధికంగా ఉన్న బీసీ జనాభాకు తగిన విధంగా 42శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. ఈనెల 20 నుంచి 22 వరకు మేడ్చల్‌లో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుర్ర సమ్మయ్య, తురక రమేష్, బుడమ వెంకన్న, కన్నె వెంకన్న, కలగూర నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఆపరేషన్ కగార్ పేరుతో సాగిస్తున్న ఆదివాసుల హత్యకాండను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివాసీ హక్కులపై జిల్లా స్థాయి సదస్సును శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. గిరిజనులను భయభ్రాంతులకు గురి చేసేలా అటవీ ప్రాంతాల్లో మారణహోమం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సదస్సులో బండారి ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, హలావత్ లింగ్యా, గుగులోత్ సక్రు, జడ సత్యనారాయణ, ఎస్‌కే బాబన్న, బట్టు చైతన్య, బోనగిరి మధు, పాపయ్య పాల్గొన్నారు.

హక్కులను పోరాడి సాధించుకోవాలి



కొత్తగూడ: కొమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు



గంగారం: ఆదివాసీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



బయ్యారం: కొమురం భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు



నెహ్రూసెంటర్: ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నాయకులు



డోర్నకల్: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు



కేసముద్రం: వేడుకల్లో పాల్గొన్న ఆదివాసీలు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి, అనంతరం ఆదివాసీ జెండా ఆవిష్కరణ చేశారు. కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆదివాసీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. హక్కులు అనేవి వాటంతట అవే మన దగ్గరకు రావని, పోరాడి సాధించుకోవాలన్నారు. ఆదివాసీలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. – సాక్షి నెట్‌వర్క్

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి నెట్‌వర్క్: రైతు బీమా 2025–26 సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తులను అందజేయాలని ఆయా మండల వ్యవసాయ అధికారులు శనివారం తెలిపారు. భూభారతి పోర్టల్ ద్వారా కొత్తగా పట్టా పాస్‌బుక్ వచ్చిన రైతులు, 2025 జూన్ 5వ తేదీ వరకు రెవెన్యూ పట్టా, ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టా వచ్చిన రైతులు మాత్రమే రైతుబీమా కోసం ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 12వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. 18నుంచి 59 సంవత్సరాల వరకు వయసు గల రైతులు అర్హులన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వృద్ధుడికి తీవ్రగాయాలు

తొర్రూరు: విద్యుత్ షాక్‌తో వృద్ధుడికి తీవ్ర గాయాల పాలైన ఘటన శనివారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన మంగళపల్లి పెంటయ్య అనే వృద్ధుడు రోజువారీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పట్టణంలోని అమ్మాపురం రోడ్డులో ఓ కార్యక్రమానికి టెంట్ వేస్తున్న క్రమంలో 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. దీంతో విద్యుత్ షాక్‌తో శరీరమంతా తీవ్ర గాయలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన 108లో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

సంతాపం

గూడూరు/మహబూబాబాద్ రూరల్: మండలంలోని రాములుతండాకు చెందిన జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నూనావత్ రాధ, భర్త నూనావత్ వీరూనాయక్(56) అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శనివారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన రాములుతండాకు తరలించారు. విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు, మాజీ ఎంపీ మాలోతు కవిత, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కత్తి స్వామి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, నాయకులు నివాళులర్పించారు. ఎంపీ పోరిక బలరాంనాయక్ సంతాపం తెలిపారు.

దళిత వర్కింగ్ జర్నలిస్టు కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: దళిత వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం ముఖ్య సలహాదారులు మైదం శ్రీనివాస్, ధర్మారపు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర భవన్‌లో శనివారం నిర్వహించిన జిల్లా సమావేశం ఏర్పాటు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కట్కూరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వెక్తూరి పూర్ణచందర్, ఉపాధ్యక్షులు చింతకుంట్ల యాకాంబ్రం, జిన్న లచ్చయ్య, తీగల ప్రేం సాగర్, సహాయ కార్యదర్శులుగా వల్లందాస్ సుధీర్‌కుమార్, అంబాల కుమార్, కోశాధికారిగా ఇరుకుళ్ల కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా లేతాకుల గోపి, ఇసంపెల్లి సాయికుమార్, మంద విక్రం, ఫ్రీజ్, కార్యవర్గ సభ్యులుగా మాధాసు మహేష్, జల్లి శ్రావణ్‌కుమార్, మిట్టపల్లి సురేందర్, పిడమర్తి ఉపేందర్, చింత వెంకన్న, మీడియా ఇన్‌చార్జ్ తకెళ్లపల్లి శ్రీనివాస్‌ను నియమించామన్నారు.

ఘనంగా జంజిరాల పౌర్ణమి



హోమం నిర్వహిస్తున్న పద్మశాలీలు

దంతాలపల్లి: మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో శనివారం పద్మశాలీలు జంజిరాల పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టకొల్ల సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పద్మశాలీలంతా ఒకేచోట జంధ్యాలు ధరించడం సంతోషంగా ఉందన్నారు. తన రాజకీయ భవిష్యత్ కోసం తమ కులహక్కుల సాధనకు ఏకమై పోరాడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేలిక భిక్షం, శ్రీను, ఉపేందర్, నర్సయ్య, నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

నెహ్రూసెంటర్: తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న అన్నారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో బాలింతలకు బ్రెడ్లు, పండ్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం వీరన్న మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, ఆసుపత్రి ఆర్ఎంఓ జగదీశ్వర్, సభ్యులు పారుపల్లి రమేష్‌బాబు, అనుమాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా యాదగిరి

తొర్రూరు: ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్(టీడబ్ల్యూజేఏ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా తొర్రూరుకు చెందిన లకావత్ యాదగిరి నాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు వెంకన్న ప్రకటించారు.